క్లుప్తంగా

డైరీ ఆవిష్కరణ



వ్యవసాయశాఖ డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తదితరులు

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా వ్యవసాయశాఖ అధికారుల డైరీని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా ఆవిష్కరించారు. గురువారం కలెక్టరేట్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆవిష్కరణలో అన్నమయ్య జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ, వ్యవసాయశాఖ సంఘం అధ్యక్షులు కె.నవీన్ కుమార్, సెక్రటరీ రమేష్‌బాబురావు, కోశాధికారి బి.వెంకటమోహన్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు చివరి అవకాశం

రాజంపేట టౌన్ : 2015- 2016 విద్యా సంవత్సరంలో డిగ్రీ చేరిన విద్యార్థులు ఐదవ సెమిస్టర్‌లో ఫెయిల్ అయిన సబ్జెక్టులను రాసుకునేందుకు యూనివర్శిటీ అధికారులు అవకాశం కల్పించినట్లు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పురుషోత్తం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షలు రాయాలనుకునే విద్యార్థులు ఈనెల 15వ తేదీలోపు ఫీజు చెల్లించాలని తెలిపారు. పై ఏడాదిలో ఐదవ సెమిస్టర్‌కు సంబంధించి పరీక్షలు రాసుకునేందుకు ఇదే చివరి అవకాశమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

బాధ్యతల స్వీకరణ

సిద్దవటం : మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారుగా రాజేష్‌క్రిష్ణ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నెలకొన్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా ఇక్కడ డీటీగా విధులు నిర్వర్తించిన వెంకటరమణ చెన్నూరు మండల డీటీగా బదిలీపై వెళ్లారు.

కరపత్రాల విడుదల

సంబేపల్లె : పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్ తెలిపారు. గురువారం మండలంలోని శ్రీ తేజ పాఠశాలలో మండలంలోని పట్టభద్రులు, ఉపాధ్యాయులతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేస్తున్న కత్తికి అండగా ఉండాలని కోరారు.

5 నుంచి కాశినాయన ఆరాధనోత్సవాలు

సిద్దవటం : మండలంలోని భాకరాపేట సమీపంలో ఉన్న శివునినల్లె గ్రామానికి ఎదురుగా వెలసిన కాశిరెడ్డినాయన స్వామి ఆరాధన ఉత్సవాలు ఈనెల 5వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 5న ప్రత్యేక పూజలు, అశ్వర్థ నారాయణ స్వామి కల్యాణం, అన్నదానం ఉంటాయన్నారు. 6న విశేష పూజలనంతరం చెక్కభజన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం బండలాగుడు పోటీలు జరుగుతాయన్నారు. ఆరాధనోత్సవాలలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైకుంఠనారాయణుడిగా శ్రీలక్ష్మీజనార్దనస్వామి

రామసముద్రం : మండల కేంద్రంలో వెలసిన శ్రీలక్ష్మీ జనార్దనస్వామి బ్రహ్మ రథోత్సవంలో భాగంగా గురువారం స్వామివారు వైకుంఠనారాయణుడి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేట టౌన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎకనామిక్స్ సబ్జెక్టును గెస్ట్ ఫ్యాకల్టీ పద్ధతిలో బోధించేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పురుషోత్తం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ ఉత్తీర్ణులై బోధనలో అనుభవం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 6వ తేదీ విద్యార్హతకు సంబంధించి ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు నేరుగా హాజరుకావచ్చని తెలిపారు.

ఆపస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

రాయచోటి టౌన్ : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం ఎన్‌జీఓ హోంలో ఆపస్ జెండాను ఎగురవేసి సరస్వతీ దేవి చిత్రపటానికి పూలమాల వేసి గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎప్పుడు ముందుంటామని తెలిపారు. కార్యక్రమంలో రెడ్డిప్రసాద్, లక్కిరెడ్డిపల్లె అధ్యక్షుడు నాగులయ్య, జీవీ రమణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉండే విధంగా..

- గడప గడపకు మన ప్రభుత్వం ఓ బృహత్తర కార్యక్రమం
- ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి



పింఛా ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి

సుండుపల్లె (వీరబల్లి) : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దేశ చరిత్రలో ఒక బృహత్తర కార్యక్రమని రాజంపేట శాసనసభ్యులు మేడా వెంకటమల్లికార్జున రెడ్డి అన్నారు. గురువారం సుండుపల్లె మండలంలోని ముడుంపాడు గ్రామ సచివాలయ పరిధిలోని ఆరోగ్యపురం బిడికి, గొందుపల్లి హరిజనవాడతోపాటు కటారుముడుకు గురువారం గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ఇప్పటి వరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ ఫలాలను వివరిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ చరిత్రలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం దేశ చరిత్రలో ఒక అద్భుతమైన కార్యక్రమం అని, ప్రజాప్రతినిధులు ప్రజలతో మమేకమై వారి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు గడప గడపకు వెళ్తున్నారన్నారు. గత ప్రభుత్వం హయాంలో ఎన్నికల సమయంలో ప్రజాప్రతినిధులు దర్శనమిచ్చేవారని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన మూడేళ్ళకే ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. మహిళలు ఎమ్మెల్యే మేడాకు హారతులు పట్టారు. సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ అందజేస్తున్నారని ప్రజలు ఎమ్మెల్యేకు తెలిపారు. ఇలాంటి ముఖ్యమంత్రి తమకు ఇంకా కొన్నేళ్లపాటు ఉండాలని ఆయనతో అన్నారు. అంతేకాకుండా నాడు-నేడు అనే పథకం ఏర్పాటు చేసి మూతపడిన పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలుగా తీర్చిదిద్ది విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందిస్తున్న ఘనత మన ముఖ్యమంత్రికే దక్కిందని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో సుండుపల్లె ఎంపీపీ రాజమ్మ, జెడ్పీటీసీ ఇస్మాయిల్, రామస్వామి రెడ్డి, ఎంపీటీసీ నసీబ్ భాను, ఎంపీటీసీ నాగరాజు, సర్పంచ్ షరీఫ్, సర్పంచ్ ఆకుల శ్రీనివాసులు, సర్పంచ్‌లు నాగేంద్ర, సరోజ, కె రమణారెడ్డి, రఫీభానుప్రకాష్ రెడ్డి, రెహ్మాన్ ఖాన్, ఆకుల శివకుమార్, నాయకులు ముడుకు వెంకటరామిరెడ్డి, కొండయ్య, మురళీ గౌడ్, చింటూ రెడ్డి, కృష్ణారెడ్డి, సుంకర హరి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎం సహాయనిధి

సిఎం సహాయనిధి పేదలకు వరం లాంటిదని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి అన్నారు. సుండుపల్లె మండలం, తిమ్మ సముద్రం గ్రామం, కామిరెడ్డి చెరువుగారిపల్లికి చెందిన కామిరెడ్డి సుబ్బారెడ్డికి సిఎం సహాయనిధి క్రింద రూ. 7.50 లక్షలు చెక్కును ఎమ్మెల్యే అందజేశారు.

పింఛా ప్రాజెక్ట్ పరిశీలన

వీరబల్లి : పింఛా ప్రాజెక్టును రాజంపేట ఎమ్మెల్యే మేడా వెంకటమల్లికార్జున రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛా ప్రాజెక్టు నిర్మాణానికి రూ. 84కోట్లు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి మంజూరు చేయించారన్నారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఈఈ వెంకటరామయ్య, కాంట్రాక్టర్ రమణారెడ్డిలకు పింఛా ప్రాజెక్టు నిర్మాణానికి యుద్ధ ప్రాతిపదికన సర్వం సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. పింఛా ప్రాజెక్టు తెగిపోవడం వలన నష్టపోయిన రైతులందరినీ ఆదుకునే విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి న్యాయం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రైతుల వివరాలను వెంటనే సేకరించి నివేదికను తయారు చేయాలని తహసీల్దార్‌ను ఆయన ఆదేశించారు.

జాతీయ స్థాయి పోటీలకు కోడూరు విద్యార్థులు



విద్యార్థులతో కోచ్ శివాజీ

రైల్వేకోడూరు అర్బన్ : గత నెల 29వ తేదీ నుంచి 31 వరకు విశాఖపట్టణం తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో అనకాపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ఎస్‌వీకేఎస్ స్పోర్ట్స్ అకాడమీకి చెందిన ముగ్గురు విద్యార్థులు బంగారు పతకం సాధించినట్లు గురువారం కోచ్ శివాజీ తెలిపారు. సీనియర్ విభాగంలో చైతన్యప్రసాద్, రవి, బాలికల విభాగంలో కృష్ణవేణిలు బంగారు పతకం సాధించారని, అలాగే సుబ్రమణ్యం, జ్యోతి, జ్యోతికుమారిలు రజత పతకం సాధించారని తెలిపారు. వీరిలో బంగారు పతకం సాధించిన ముగ్గురు ఫిబ్రవరి 10 నుంచి 12 వరకు పుదుచ్చేరి రాజీవ్‌గాంధి ఇండోర్ స్టేడియంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. గెలుపొందిన విద్యార్థులను పలువురు అభినందించారు.

సంపన్న వర్గాలకే కేంద్ర బడ్జెట్



రాజంపేట రూరల్: బడ్జెట్ పత్రాలను దగ్ధం చేస్తున్న నాయకులు

పెనగలూరు : దేశంలో సంపన్న వర్గాలకే కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని సీపీఐ మండల కార్యదర్శి గానుగపెంట ఆదినారాయణ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ వర్గాలకు, సంపన్న వర్గాలకు ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం మొండిచెయ్యి చూపించిందన్నారు. గత ఏడాది ఉపాధి హామీకి రూ. 73 వేల కోట్లు కేటాయిస్తే ఈ ఏడాది రూ. 60 వేలు కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. కూలీలపై కేంద్రం చిన్నచూపు చూసిందని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం మండలాధ్యక్షులు రేవూరు శంకరయ్య, సీపీఐ నాయకులు పాండురంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులకు ఉపయోగపడని బడ్జెట్

రామాపురం : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఎటువంటి మేలు జరగదని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు సుమిత్ర అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిశు సంక్షేమ శాఖకు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించడాన్ని తప్పుబట్టారు. దీంతో సామాన్యులపై ప్రభుత్వ చిత్తశుద్ధి ఏంటో అర్థమవుతోందన్నారు. కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తున్న బీజేపీ ప్రభుత్వం విధానాలకు ఈ బడ్జెట్ అద్దం పట్టినట్లు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

బడ్జెట్ కార్మికులను నిరాశపరిచింది

రాజంపేట రూరల్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ కార్మికులను తీవ్రంగా నిరాశపరిచిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సి.రవికుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.నరసింహా అభిప్రాయపడ్డారు. స్థానిక జౌళీ బజార్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు, అనంతరం బడ్జెట్ పత్రాలను దగ్ధం చేశారు. తదనంతరం వారు మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేక హోదా లేదని మండిపడ్డారు. విభజన హామీలను కేంద్రం మరిచిపోయిందని వాపోయారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న చెరువు మట్టి

సిద్దవటం : మండలంలోని టక్కోలి గ్రామ పంచాయతీ ఖాజీపల్లె గ్రామ సమీపంలోని చెరువులో మట్టిని స్థానికులు కొందరు అక్రమంగా తరలిస్తున్నారు. చాలా కాలంగా రోజుకు 12 ట్రాక్టర్‌లు రాత్రివేళల్లో చెరువు మట్టిని కూలీలతో తవ్వించి కడప సమీపంలోని బుడ్డాయపల్లె గ్రామంలోని ఇటుకల బట్టీలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఒక ట్రాక్టర్ మట్టిని రూ.2000కు విక్రయిస్తున్నారు. ఈ విషయమై గతంలో స్థానికులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టి పట్టనట్లు వ్యవహరించారని స్థానికులు తెలిపారు. అసైన్‌మెంటు కమిటీలో భూమిని పొందేందుకు మట్టి తరలించి భూమి చదును చేస్తున్నారని స్థానికులు తెలిపారు. ఈ విషయమై వీఆర్‌ఓ కేశవులును వివరణ కోరగా మట్టి తరలించే విషయం తమ దృష్టికి రాలేదని చెరువు మట్టి అన్యాక్రాంతం గాకుండా కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

జాతీయ స్థాయి బేస్‌బాల్ బట్టుకు శ్రీజ



పుల్లంపేట : మండల పరిధిలోని ఏపీ ఆదర్శ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థినీ ఎన్.శ్రీజ జాతీయ బేస్‌బాల్ జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీహరి, ఫిజికల్ డైరెక్టర్ నీలకంఠరావులు తెలియజేశారు. జనవరి 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్- 17 బేస్‌బాల్ పోటీలలో అద్భుతమైన ప్రతిభ కనబరిచి జాతీయ జట్టుకు ఎంపిక అయ్యిందన్నారు. శ్రీజను ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు అభినందించారు. శ్రీజ జాతీయస్థాయిలోనూ రాణించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని కొరముట్ల ఆకాంక్షించారు. అనంతరం ఫిజికల్ డైరెక్టర్ నీలకంఠరావును ఎమ్మెల్యే అభినందించారు.

బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

రాజంపేట : రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు ఆర్టీసీ డీఎం కార్యాలయంలో బహుమతులను అందజేశారు. చిట్వేలి జెడ్పీహైస్కూల్ విద్యార్థులు వెంకటకళ్యాణికి మొదటి బహుమతి, టి.మహేశ్వరికి రెండవ బహుమతి, డి.శివాజీ మూడవ బహుమతి, పి.లక్ష్మీ త్రివేణికి నాలుగవ బహుమతిని గెలుచుకున్నారు. వీరికి అసిస్టెంట్ మేనేజరు మాధవీలత బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీఐ డీఆర్ ప్రమీల, ఆర్టీసీ హెడ్ కానిస్టేబుల్ శంకర్, ఎన్ఎంయూ నాయకుడు రమణ, లెక్చరర్ దుర్గరాజు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను పూర్తి చేయండి

రాయచోటి అర్బన్ : మున్సిపల్ పరిధిలో అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్ళ నిర్మాణ పనులను వెంటనే పూర్తిచేసి లబ్ధిదారులకు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు అన్నారు. గురువారం ఆయన సీపీఐ నేతలు సిద్దిగాళ్ళ శ్రీనివాసులు, జక్కల వెంకటేష్, సీనియర్ నేత వెంకటేష్, వై.పుల్లయ్యలతో కూడిన బృందంతో కలసి సుండుపల్లె మార్గంలో అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్ళ నిర్మాణ పనులను పరిశీలించి, మాట్లాడారు. వివిధ దశల్లో నిలిచిపోయిన టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలన్నారు. లేకుంటే జిల్లా కలెక్టరేట్ వద్ద గృహ లబ్ధిదారులతో కలసి ఆందోళనను నిర్వహించనున్నట్లు తెలిపారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

వైవీయూ : విద్యార్థులు చదువుతో పాటు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి దీప్తి పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని శ్రీవివేకానంద మహిళా డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువకేంద్రం, నోబుల్ సేవాసంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు.

ఆసరాగా ఉన్నాం.. ఆశీర్వదించండి



గాలివీడు: లబ్ధిదారురాలికి పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

గాలివీడు : అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని రాయచోటి ఎమెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన తలముడిపి, కొర్లకుంట గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి తలముడిపి, హరిజనవాడ, కలంకపల్లె, గుడిసిలోళ్లపల్లె, రెడ్డిమానుపల్లె, నాయినివారిపల్లెలలో సంక్షేమ పథకాల బుక్‌లెట్లను లబ్ధిదారులకు అందించారు. ప్రతి ఇంటికి వెళ్ళి అవ్వా పింఛన్ అందుతుందా, అక్కా చేయూత అందుతుందా, ఆసరా వచ్చిందా, అమ్మఒడి పడిందా అంటూ చిరునవ్వుతో లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో రాష్ట్ర ప్రభుత్వం 98శాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. అవినీతికి తావులేకుండా సచివాలయం వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పథకాలు ఇంటి గుమ్మం వద్దకే వస్తున్నాయని తెలిపారు. గత ప్రభుత్వాల్లో ఏ నాయకుడైనా ఇంటివద్దకు వచ్చి ప్రభుత్వం చేసిన మంచి పనులు చెప్పిన దాఖలాలు లేవన్నారు. ఇది ఒక జగనన్న ప్రభుత్వానికి మాత్రమే సాధ్యమైందని స్థానికంగా తలముడిపి, కొర్లకుంట గ్రామాలలో గుర్తించిన చిన్నచిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జల్లా సుదర్శన్ రెడ్డి, వైస్ ఎంపీపీ యదుభూషన్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు ఖాదర్ మొహిద్దీన్, సర్పంచ్‌లు ఎం.జ్యోతమ్మ, ఉమాపతి రెడ్డి, చెన్నకేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు భానుమూర్తి రెడ్డి, ఉమాప్రభాకర్, గుమ్మా అమర్నాథరెడ్డి, ఎంపీటీసీలు గడ్డం చంద్రప్రకాష్ రెడ్డి, పి.జనార్దన్ రెడ్డి, అమానుల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నివాళి

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని పాలెంగొల్లపల్లె మాజీ సర్పంచ్ రామచంద్రయ్య మామ వెంకటేష్ బుధవారం అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డిలు మృతుడు వెంకటేష్ మృతదేహానికి నివాళి అర్పించారు. మరో కార్యక్రమంలో మద్దిరేవుల ఉప సర్పంచ్ సంజీవరెడ్డి తండ్రి నారాయణరెడ్డి దశదిన కర్మకాండలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

10తేదీలోపు బేస్ మట్టాలు పూర్తి చేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ తదితరులు

పెనగలూరు : మండలంలో ఈనెల 10వ తేదీలోపు పక్కా గృహాలకు బేస్ మట్టాలు పూర్తి చేయాలని మండల వైస్ ప్రెసిడెంట్ కొండూరు విజయ్ రెడ్డి తెలిపారు. సోమవారం పెనగలూరు వైస్ జగనన్న కాలనీలో ఆయన పర్యటించి లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ద్వారా ప్రతి లబ్ధిదారుని పేరు పిలిచి ఇంటి నిర్మాణ విషయమై వాకబు చేశారు. ఎవరికైనా నగదు తక్కువగా ఉంటే వెలుగు ద్వారా వారికి డబ్బులు ఇవ్వాలని ఏపీఎంను ఆదేశించారు. అలాగే రూ.35వేలు వెలుగు ద్వారా తీసుకునే డబ్బులతో స్లాబ్ లెవల్‌కు గోడలు ఎక్కించాలని ఆయన సూచించారు. 10వ తేదీలోపు బేస్ మట్టాలు పూర్తి చేయకుంటే వారికి నోటీసులు అందించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. అనంతర సిబ్బందితో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏఓ పద్మభూషన్‌రెడ్డి, ఈఓపీఆర్‌డీ సుధాకర్ రెడ్డి, సెక్రటరీ రమణ, సచివాలయం సిబ్బంది, వ్యవసాయ సలహా మండలి మండలాధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి, సర్పంచ్ ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా సమస్యలు ఎదుర్కోవాలి



మాట్లాడుతున్న సీడీపీఓ రాజేశ్వరి

ఓబులవారిపల్లె : విద్యార్థినులు సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొని అత్యున్నత స్థాయికి ఎదగాలని సీడీపీఓ రాజేశ్వరి పేర్కొన్నారు. గురువారం చిన్నఓరంపాడు కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిషోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిషోర బాలికలు రోజువారి తమకు ఎదురయ్యే చెప్పుకోలేని సమస్యలను సైతం ఆత్మీయులతో పంచుకొని పరిష్కార దిశగా అడుగులు వేయాలన్నారు. ఆడబిడ్డల పట్ల అసభ్యకరంగా ఎవరైనా ప్రవర్తిస్తే తల్లిదండ్రులకు గానీ, ఉపాధ్యాయులకు గానీ తెలియజేయాలన్నారు. 18 సంవత్సరాల లోపు ఆడపిల్లలకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి సమస్యలు ఎదురైతే 1098, 100, 181, 112 హెల్ప్‌లైన్‌లకు సమాచారం అందించి రక్షణ పొందాలని సూచించారు. ఐసీడీఎస్ గ్రేడ్-1 సూపర్‌వైజర్ సి.అనుసూయ, ప్రిన్సిపాల్ వాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మణెమ్మ, గుణవతి, జయలక్ష్మి, నిర్మల, ఏఎన్ఎంలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల సత్తా



విద్యార్థినులను అభినందిస్తున్న మౌనిక

నందలూరు(రాజంపేట) : మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో సింహాచలంలో గత నెల 29 నుంచి 31 వరకు జరిగిన రాష్ట్రస్థాయి క్రీడల పోటీలో నందలూరు క్యాంపులో పాల్గొన్న జిల్లా విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ మేరకు విద్యార్థులను గురువారం జిల్లా కన్వీనరు మౌనిక అభినందించారు. క్రీడాపోటీలలో బాలికల విభాగంలో చెస్‌లో లలిత ప్రథమ బహుమతి సాధించారు. తొండూరు, నందలూరు, వనిపెంట పాఠశాలలకు చెందిన విద్యార్థులు కబడ్డీ, వాలీబాల్‌లో రన్నర్స్‌గా నిలిచారు. డిస్క్ త్రో బాలుర విభాగంలో సుబ్బరాయుడు ప్రథమ బహుమతిని, చెస్‌లో చరణ్ రెండవ బహుమతిని సాధించారు. కమలాపురం, జమ్మలమడుగు విద్యార్థులు హ్యాండ్‌బాల్ పోటీల్లో రన్నర్స్‌గా నిలిచారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు సునీతని ప్రశంసించారు.

వెన్నపూసకు అండగా నిలవండి

పట్టభద్రుల ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నేతలు



చిన్నమండెం: వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

చిన్నమండెం/రామాపురం : పశ్చిమ రాయలసీమ వైఎస్ఆర్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా నిలవాలని వెన్నపూస జయసింహారెడ్డి కోరారు. గురువారం జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి ఆధ్వర్యంలో రవీంద్రారెడ్డికి మద్దతుగా చిన్నమండెంతోపాటు రామాపురం మండలాల్లోని పలు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలు, విద్యాసంస్థలు, పోలీసు స్టేషన్‌లలో సిబ్బంది కలిసి, వెన్నపూసకు మొదటి ప్రాధాన్యతా ఓటును వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ అంజనప్ప, గూటం రాము, ఎంపీటీసీ ఏజాస్‌ఆలీఖాన్, పంచాయతీ సెక్రటరీ పద్మావతి, జిల్లా కార్యదర్శి నాగార్జున పాల్గొన్నారు.

మామడి, నిమ్మ తోటల్లో సస్యరక్షణ చేపట్టండి



మామిడి తోటలను పరిశీలిస్తున్న సురేష్ బాబు

పెనగలూరు : మామిడి, నిమ్మ పూత, పిందె దశలలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని హార్టికల్చర్ అధికారి సురేష్ బాబు అన్నారు. గురువారం ఆయన మండలంలోని ముద్రపల్లి, పొందలూరు ఆర్‌బీకేల పరిధిలోని మామిడి, నిమ్మ తోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పూత ప్రారంభమయ్యే దశలో పువ్వు, మొగ్గలను ఉత్తేజపరిచి పూత రావడానికి ఆడపూలశాతం పెరగడానికి పొటాషియం నైట్రేట్ (మల్టీ-కె) 10 గ్రాములు, బోరాన్ 2 గ్రాములు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే తేనెమంచు పురుగు నివారణకు మోనోప్రోటోఫాస్‌తోపాటు ఇతర మందుల గురించి ఆయన రైతులకు వివరించారు. మామిడి, నిమ్మ తోటల రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆర్‌బీకే సిబ్బంది తేజశ్రీ, భవానీ, రైతులు పాల్గొన్నారు.

స్మర్శపై అవగాహన సదస్సు

చిట్వేలి : మహాత్మా గాంధీ 75వ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం స్పర్శపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి అబ్దుల్ అన్సారీ మాట్లాడుతూ కుష్ఠువ్యాధి, స్పర్శలేని మచ్చలు ఏర్పడి ఒకరి నుంచి మరొక్కరికి తుమ్మడం, దగ్గడం ద్వారా వ్యాప్తి చెందుతాయన్నారు. ఈ వ్యాధి నిర్మూలనకు 9 నెలలుపాటు చికిత్స తీసుకుంటే సరిపోతుందన్నారు. లక్షణాలు ఉన్నవారు పీహెచ్‌సీ కేంద్రానికి రావాలని వైద్య సిబ్బంది పరీక్షలు చేసి సరైన చికిత్సను అందిస్తారన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఈ వ్యాధి ఇతరులకు సోకే ప్రమాదం ఉందని తెలిపారు. కుష్టులేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ రాష్ట్ర ప్రభుత్వానికి, వైద్య సిబ్బందికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఉమామహేశ్వర రెడ్డి, హెచ్‌ఈఓ మురళీ, హెల్త్ సూపర్‌వైజర్ ఇస్మాయిల్ బాషా, ఎంఎల్‌హెచ్ కల్పన, పద్మ, మమత, ఆశలు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ కొత్తపురమ్మ

సంబేపల్లె : మండల పరిధిలోని దుద్యాల పంచాయతీ సమీపంలో వెలసిన కొత్తపురమ్మ ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవారి మూలవిరాట్ మూర్తికి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. మండలం నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

సాయినాథుడికి పూజలు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలో వెలసిన సద్గురు సాయిబాబా ఆలయంలో గురువారం అర్చకులు బండి ఆత్మకూరు సతీష్ శర్మ ఆధ్వర్యంలో భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం భక్తులు ఆలయానికి వచ్చి ప్రత్యేకాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. రాత్రి స్వామివారికి ఉంజల్, పల్లకీ సేవలు నిర్వహించారు. అలాగే రాముల వారికి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

'బీజేపీ అరాచకాలు కొనసాగవు'

రాజంపేట రూరల్ : హాథ్ సే హాథ్ జోడో అభియాన్ కరపత్రాలను కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఏపీసీసీ కార్యవర్గ సభ్యులు ఏ.గంగాధర్ ఆవిష్కరించారు. స్థానిక ఆర్అండ్‌బీ కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించి ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర మంత్రి అమిత్ షాలపై తీవ్ర ఆరోపణలు చేశారు. దేశాన్ని దుష్టుల చేతుల్లో నుంచి కాపాడటానికే రాహుల్‌గాంధీ జోడో యాత్రను నిర్వహించారన్నారు. దేశంలో బీజేపీ చేస్తున్న అరాచకాలు ఎక్కువ రోజులు కొనసాగవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు కే సుబ్రమణ్యం, కార్యదర్శి పాండురంగయ్య, మండలశాఖ అధ్యక్షులు లేబాకు రవి, పట్టణ అధ్యక్షులు ఎస్.మహమ్మద్, నందలూరు మండల అధ్యక్షులు సుబ్బరాయుడు, నాయకులు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.